క్లుప్తంగా

వణికిస్తున్న చలి పులి



డాక్టరు గంగాధరరావు

నల్లజర్ల: చలి ప్రజలను వణికిస్తోంది. ఉదయం 8 గంటల వరకూ మంచు కురుస్తుండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. చలి తీవ్రత వల్ల వేకవ జామునే లేచి పొలాలకు వెళ్లి పశువుల నుంచి పాలు తీసుకువచ్చేవారు, హోటళ్ల నిర్వాహకులు, పేపర్ బాయ్స్ పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం. సాయంత్రం ఐదు గంటలైతే చాలు చలి ప్రారంభం అవుతోంది. వివిధ ప్రాంతాల నుంచి బైక్‌లపై ఇళ్లకు చేరే వారు చలి తీవ్రతకు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం కరోనా వ్యాధి అక్కడక్కడా కనిపిస్తున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి కాలంలో కరోనాతో పాటు చర్మ, గొంతు సంబంధిత వ్యాధులు సోకే అవకాశం ఉందని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు హెచ్చరించారు. ఏమాత్రం అలసత్వం వహించినా వ్యాధుల బారిన పడతారన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చలిలో ఎక్కువగా తిరగడం, రక్షణ దుస్తులు లేకుండా ఎక్కువ దూరం ప్రయాణం చేయడం వల్ల వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు.

వేంకటేశుని హుండీ ఆదాయం రూ.3.72 లక్షలు



అన్నవరప్పాడులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు, మహిళలు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. ప్రధాన హుండీతో పాటు ఉపాలయాల హుండీలా ద్వారా 28 రోజులకు రూ.3.72 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరిచారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని ఈవో చెప్పారు. కార్యక్రమంలో వేలివెన్ను గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్య నిర్వహణాధికారి పీవీ సుబ్రహ్మణ్యం, పంతం చిన్న, పులపర్తి నాగరాజు, పంతం నాగేశ్వరరావు, యాళ్లబండి శ్రీనివాస్, కోటిపల్లి గంగన్న, ఓసూరి బాల నాగేశ్వరరావు, పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి అన్నాభిషేకం



పాలంగిలో రామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించిన భక్తులు

ఉండ్రాజవరం: పాలంగి గ్రామంలోని రామలింగేశ్వరస్వామి వారికి వైభవంగా అన్నాభిషేకం నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని బుధవారం అన్నాభిషేకం నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు రఘు చెప్పారు. ఈ సందర్భంగా భక్తులు క్యూలో నిలబడి ఒకరి తరువాత మరొకరు ప్లేట్లలో ఉంచిన అన్నాన్ని అర్చకులకు అందించి స్వామి వారికి సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, పాలంగి సర్పంచ్ బొక్క శ్రీనివాసు, దేవస్థానం చైర్మన్ దొడ్డా సూర్యనారాయణ, సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

దేవరపల్లి: ఇటీవల మండలంలోని దుద్దుకూరులో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోలిమాటి నరేష్ , గుండెపోటుతో మృతి చెందిన పత్తిపాటి సురేష్ కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ అండగా నిలిచింది. ఇద్దరి మృతుల కుటుంబాలను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు బుధవారం పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

పెరవలి: మండలంలోని కాపవరం పొలాల మధ్య నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పెరవలి పోలీసులు బుధవారం ఉదయం దాడి చేశారు. పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2,430 నగదు స్వాధీనం చేసుకున్నామని పెరవలి ఎస్సై ఎం. సూర్య భగవాన్ తెలిపారు. అరెస్టు చేసిన ఆరుగురినీ కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.

36 లీటర్ల సారాతో ఇద్దరు..

దేవరపల్లి: దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో యర్నగూడెంలో బొల్లం పవన్ వద్ద ఆరు లీటర్లు, గోపాలపురం మండలం జగన్నాథపురంలో చాపల బేబీ వద్ద 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఇరువురినీ అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ సీఐ డి.సుధ తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఆమె తెలిపారు.

పొగాకు తోటలకు భారీ నష్టం

- మిచాంగ్ తుపాను ముంపుతో 10,390 హెక్టార్లలో పంట నష్టం
- ప్రభుత్వానికి నివేదికల సమర్పణ
- హెక్టార్‌కు రూ.10 వేల చొప్పున పరిహారం



దేవరపల్లి మండలం బందపురంలో తుపాను వల్ల దెబ్బతిన్న పొగాకు తోట (ఫైల్)



ఎం. ఆదిశేషయ్య, ఆర్ఎం, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

దేవరపల్లి: మిచాంగ్ తుపాను వల్ల సంభవించిన పంట నష్టం అంచనాలను అధికారులు సిద్ధం చేశారు. పొగాకు బోర్డు , వ్యవసాయ శాఖ అధికారులు పొగాకు పంట పూర్తి నష్టం, పాక్షిక నష్టం వివరాలను తయారు చేసి, తుది నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ విషయాన్ని పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు ఎం.ఆదిశేషయ్య తెలిపారు. దేవరపల్లి వేలం కేంద్రంలో బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల పరిధిలో 10,390 హెక్టార్ల విస్తీర్ణంలోని పొగాకు పంట దెబ్బతిన్నట్టు తెలిపారు. దీనిలో 6,743 హెక్టార్లలో పూర్తి గాను, మరో 2,667 హెక్టార్లలో పాక్షికంగా తోటలు దెబ్బతిన్నట్టు వివరించారు. తూర్పుగోదావరి జిల్లా తొర్రేడు ప్రాంతంలో 980 హెక్టార్లలో పొగాకు సాగులో ఉండగా పూర్తిగా దెబ్బతిన్నట్టు చెప్పారు. వేలం కేంద్రాల వారీగా దెబ్బతిన్న పంట వివరాలను ఆయన వివరించారు. వేలం కేంద్రం పూర్తి నష్టం హెక్టా రుకు రూ.10 వేల పరిహారం దెబ్బతిన్న తోటలకు హెక్టారుకు రూ.10 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించి రైతులను ఆదుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేస్తోందని ఆర్ఎం ఆదిశేషయ్య తెలిపారు. క్యూరింగ్ దశకు వచ్చిన తోటలు కూడా ఇసుక మేటలు వేసి దెబ్బతిన్నట్టు వివరించారు. తొర్రేడు ప్రాంతంలో పొగాకు తోటలు పూర్తిగా వరద నీటి ముంపునకు గురవడంతో తోటలు నిలువునా కుళ్లిపోయాయన్నారు. దీని వల్ల 903 మంది రైతులు ఆర్థికంగా దెబ్బతిన్నట్టు తెలిపారు. ఈ ప్రాంతం దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో ఉందని ఆయన చెప్పారు.

పాక్షిక నష్టం

	(హెక్టార్లలో)	(హెక్టార్లలో)
దేవరపల్లి	366	---
జంగారెడ్డిగూడెం–1	1,480	1,100
జంగారెడ్డిగూడెం–2	1,586	449
కొయ్యలగూడెం	1,563	382
గోపాలపురం	1,758	755
తొర్రేడు (ఎస్‌బీఎస్)	980	---
మొత్తం	7,763	2,667

రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు

- కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం
- అజెండాలోని 17లో 16 అంశాలకు పచ్చ జెండా



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ రత్నకుమారి



హాజరైన కౌన్సిలర్లు

కొవ్వూరు: మునిసిపాలిటీ పరిధిలో అత్యంత ముఖ్యమైన 39 పనులను రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ పనులన్నీ ఇటీవల హోం మంత్రి తానేటి వనిత గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించినవి. బుధవారం నిర్వహించిన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశానికి చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షత వహించారు. అజెండాలో ప్రతిపాదించిన 17 అంశాల్లో 16 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రిజర్వేషన్ ప్రక్రియ చూడాల్సి ఉండడంతో కమిషనర్ అభ్యర్థన మేరకు 14వ అంశాన్ని వాయిదా వేసినట్టు చైర్ పర్సన్ రత్నకుమారి ప్రకటించారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

వీధి దీపాలకు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటుకు రూ.82 వేలు, ఆరో వార్డులో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ.6 లక్షలు కేటాయిస్తూ సమావేశంలో తీర్మానం చేశారు. 18వ వార్డులో రూ.17 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణం, అదే వార్డులో రూ.9 లక్షలతో మరో రోడ్డు నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. తొమ్మిదో వార్డులో సిమెంట్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.5 లక్షలు, పదో వార్డులో అవుట్‌ఫాల్ డ్రెయిన్‌పై కవర్ శ్లాబ్ ఏర్పాటుకు రూ.5లక్షలు కౌన్సిల్ కేటాయించింది. అలాగే నందమూరు రోడ్డులో కవర్ శ్లాబ్‌కు రూ.90 వేలు, బస్టాండ్, ఎల్ఐసీ ఆఫీసు ఏరియాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ప్రజా సమస్యలపై చర్చ

ఆసరా దరఖాస్తు ఆన్‌లైన్ చేయడానికి ఆర్పీలు రూ.200 చొప్పున మామూళ్లు తీసు కుంటున్నట్టు ఒకటో వార్డు కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ ఆరోపించారు. స్వయం సహాయక సంఘాల గ్రూపు సభ్యుల రుణాలు మంజూరుకు సొమ్ములు గుంజుతున్నారని కౌన్సిలర్లు అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, సత్యనారాయణ ఆరోపించారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలకు పూర్తి చేయించి లబ్ధిదారులకు అప్పగించాలని, బ్యాంకుల నుంచి వడ్డీ భారం లేకుండా చర్యలు తీసుకోవాలని సూరపనేని చిన్ని కోరారు. టిడ్కో రుణాలపై రెండేళ్ల మారిటోరియం అమలులో ఉందని కమిషనర్ బి.శ్రీకాంత్ చెప్పారు. అసంపూర్తి నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని తెలిపారు. అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్నందున అవసరమైతే ప్రైవేట్ సిబ్బందిని ఏర్పాటు పట్టణంలో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ప్రకటించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ, గంద్రోతు అంజనీదేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అంతా ఓకే .. డ్రెయిన్లు నిర్మించండి

- మా సంపూర్ణ మద్దతు మీకే ..
- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడికి అరుంధతీయపేట వాసుల సంఘీభావం
- పెరవలిలో కొనసాగిన గడప గడపకూ..



పెరవలి ఎస్సీ ఏరియాలో వృద్ధురాళ్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: 'పదేళ్ల తర్వాత మా కాలనీలో రోడ్లు వేశారు. అవి కూడా సిమెంట్ రోడ్లు. వాటర్ ట్యాంక్ నిర్మాణంతో కాలనీ వాసుల తాగునీటి సమస్య తీరింది. మా అందరికీ తంచనుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. అంతా బాగానే ఉంది. కానీ మాదో చిన్న సమస్య అయ్యా' అంటూ పెరవలి పంచాయతీ పరిధిలోని అరుంధతీయపేట మహిళలు నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడికి విన్నవించుకున్నారు. ఏమిటో చెప్పండమ్మా.. చేస్తాను. ఇంతకీ మీరంతా బాగున్నారా? అంటు ఆయన వారిని ఆప్యాయంగా పలకరించారు. అంతా హ్యాపీ సార్.. కాలనీలో డ్రెయిన్లు నిర్మించాలని మహిళలు కోరారు. తప్పకుండా నెరవేరుస్తానమ్మా అంటూ ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. బుధవారం ఆయన పెరవలి పంచాయతీ పరిధిలోని అరుంధతీయ పేటలోను, బీసీ ఏరియాలోని పుంతలో మునలమ్మ గుడి ఏరియాలోను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తన హయాంలో పెరవలి పంచాయతీ పరిధిలో రూ.70 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేశానని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరిన్ని పనులు చేస్తానని, అవినీతి రహితంగా పని చేస్తానని ఆయనన్నారు. తమ గ్రామాన్ని, తమ కాలనీని అభివృద్ధి చేసిన శ్రీనివాస్ నాయుడికే అండగా నిలుస్తామని అరుంధతీయపేట మహిళలు స్పష్టం చేశారు. ఈ పంచాయతీ పరిధిలోని 480 ఇళ్లను ఎమ్మెల్యే సందర్శించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అధికారులుకు తగు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్టి రాంబాబు, దొడ్డిగర్ల స్వాతి, పంచాయతీ సర్పంచ్ గంగోలు సీతమ్మ, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పంపన అంజి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు



ఖండవల్లిలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: జల్‌జీవన్ మిషన్ కింద రూ.5.02 కోట్ల వ్యయంతో మండలంలోని ఖండవల్లి పంచాయతీ పరిధిలో చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను బుధవారం ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ పరిశీలించారు. ఈ తాగునీటి పథకంలో భాగంగా చేపట్టే పైప్‌లైన్‌ల విస్తరణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ పెరుగుతున్న ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఖండవల్లి చెర్వు గట్టు రామాలయం వీధిలో లక్ష లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ మంచినీటి పథకం పూర్తయి, అందుబాటులోకి వస్తే గ్రామస్తుల తాగునీటి సమస్య తీరుతుందన్నారు. అంతేగాకుండా ఇంటింటికీ తాగునీటి కుళాయిలు వస్తాయన్నారు. నిర్మాణ పనులు మూడు నెలల్లో పూర్తవుతాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కందా వెంకన్న, నాగు, చిన్నబాబు, రాంబాబు, కృష్ణ పాల్గొన్నారు.

పేదల ఇంట సంక్షేమ ఫలాలు



మునిపల్లిలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు. చిత్రంలో పార్టీ శ్రేణులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- మునిపల్లిలో పలు భవనాలకు ప్రారంభోత్సవం

నిడదవోలు రూరల్: పేదల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలు మండలం మునిపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు బుధవారం ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో, మునిపల్లిలో రూ.17.40 కోట్ల వ్యయంతో సంక్షేమ పథకాలు, రూ.4.97 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. సీఎం జగనన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలన్నీ లబ్ధిదారుని ఇంటికే వచ్చి చేరుతున్నాయని చెప్పారు. నవరత్నాల పథకాల అమలుతో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. గత ప్రభుత్వ హయంలో జన్మభూమి కమిటీల సిఫార్సులకే పెద్దపీట వేసి, పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలగన నరేష్, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు కొర్లపాటి మోహన్, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కొమ్మన హరీష్, నాయకులు నామాల బాబి, బోనేపల్లి సుబ్బారావు, ఎంపీడీఓ పి.శామ్యూల్, ఈఓపీఆర్డీ రత్నమాలిక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఫిర్యాదుపై నలుగురిపై కేసు

కొవ్వూరు: శారీరకంగా, మానసికంగా తనను వేధిస్తున్న భర్త, అత్తింటి వారిపై పట్టణానికి చెందిన మద్దాల వీరవెంకట శ్రీదేవి అనే వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం ఆమెకు భీమవరానికి చెందిన కార్తీక్‌తో 2022లో వివాహమైంది. కొంత కాలంగా భర్త కార్తీక్, అత్తమామలు, బావ కలిసి తనను వేధిస్తున్నారంటూ శ్రీదేవి కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై బి. దుర్గాప్రసాద్ తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నిడదవోలు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ పద్మావతి తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

అన్న సమారాధన

చాగల్లు: ముక్కోటి ఏకాదశి ఉత్సవాల ముగింపు సందర్భంగా చాగల్లు శెట్టిబలిజ రామాలయం వద్ద బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి చాగల్లు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి ప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



రావూరుపాడులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ తదితరులు


తాళ్లపూడి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని 15 సచివాలయాల పరిధిలో బుధవారం యువతకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 1,710 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. రావూరుపాడులో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ సందర్శించారు. పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, నాయకులు తోట రామకృష్ణ , ఏఎంసీ వైస్ చైర్మన్ కొలిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, తాడిపూడిలో నామా గోపాలం, అన్నదేవరపేటలో ఎలిపే సుధారాణి, బల్లిపాడులో ఎల్లిన శివ, గజ్జరంలో గండి రాంబాబు, ప్రక్కిలంకలో నాయకులు యాళ్ల బాబురావు తదితరులు క్రీడలకు ఏర్పాట్లు చేసి క్రీడాకారులకు అండగా నిలిచారు.

రెండో రోజు క్రికెట్ టోర్నీ

దేవరపల్లి: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా రెండో రోజు బుధవారం పురుషులకు, మహిళలకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో పోటీలు జరిగాయి. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం , నల్లజర్ల మండలాల్లో 18,791 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారిలో 7180 మంది మహిళలు, 11611 మంది పురుషులు ఉన్నారు. క్రీడాకారులకు ఉచితంగా ప్రభుత్వం క్రీడా పరికరాలు అందజేసింది.

చాగల్లు: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా బుధవారం గ్రామ సచివాలయాల పరిధిలో వాలీబాల్ పోటీలు నిర్వహించినట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో నిర్మలకుమారి తెలిపారు.చాగల్లు, నెలటూరు, ఊనగట్ల, చిక్కాల తదితర గ్రామాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సహంగా పాల్గొన్నారు.

దాత సాయంతో వాటర్ ట్యాంక్ నిర్మాణం



ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

తాళ్లపూడి: దాత సాయంతో మండలంలోని మలకపల్లి గ్రామంలో నిర్మించిన వాటర్ ట్యాంకును బుధవారం ఆ పంచాయతీ సర్పంచ్ రాపాక రాజేశ్వరి, ఇతర పెద్దలు ప్రారంభించారు. మలకపల్లి వాసుల తాగునీటి అవసరాల కోసం ఆ గ్రామానికి చెందిన మద్దిపాటి ప్రభాకర్ చౌదరి తన తండ్రి వీర్రాజు జ్ఞాపకార్థం రూ.రెండు లక్షల వ్యయంతో ఈ వాటర్ ట్యాంక్ నిర్మించారు. ప్రభుత్వం ప్రక్కిలంక నుంచి గోదావరి జలాలను మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా చేస్తుంది. అయితే అవసరం మేరకు తాగునీటిని నిల్వ చేసేందుకు గ్రామంలో వాటర్ ట్యాంకులు లేవు. ఎస్సీ ఏరియాలో ఒకటి, ఓసీ ఏరియాలో మరొకటి అవసరం కాగా పంచాయతీ కార్యాలయం సమీపంలో దాత ఈ వాటర్ ట్యాంకును నిర్మించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దిపాటి రామారావు, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరి, టీడీపీ నాయకులు రాపాక తిలక్, కాసాని చిట్టిబాబు, మద్దిపాటి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

వెంటనే సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే తలారికి అంగన్‌వాడీల వినతి



దేవరపల్లిలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

దేవరపల్లి: తమ సమస్యలు, డిమాండ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని గోపాలపురం ఐసీడీఎస్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కోరారు. దేవరపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మెల్యే వెంకట్రావును ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ సారథ్యంలో వారు కలసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును అంగన్‌వాడీలు ముట్టడించి ముట్టడించి, ధర్నా చేశారు. మధ్యాహ్నం రెండింటికి క్యాంపు ఆఫీసుకు చేరుకున్న ఎమ్మెల్యే తలారి అంగన్‌వాడీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సహచర ఎమ్మెల్యేలతో పాటు వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ట్రైనీ డీఎస్పీ భావోదయ, సీఐ ఎ .శ్రీనివాసరావు, ఎస్సై కె. శ్రీహరిరావు ఆధ్వర్యంలో పోలీసులు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు టీపీ లక్ష్మి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్, కొత్తగుండ రత్నాజీ, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.


రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలి



బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న ఆ పార్టీ నాయకులు

కొవ్వూరు: కోవిడ్‌కు ముందు కొవ్వూరు స్టేషన్‌లో రద్దు చేసిన రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరికి వినతి పత్రం అందజేశారు. బుధవారం రాజమహేంద్రవరం విచ్చేసిన పురంధేశ్వరిని బీజేపీ నాయకులు కలుసుకున్నారు. రైళ్ల హాల్ట్‌ల రద్దుతో కొవ్వూరు ప్రాంత ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. డివిజన్ కేంద్రమైన కొవ్వూరులో గతంలో మాదిరిగా రైళ్లు ఆగేలా కేంద్ర ప్రభుత్వం , రైల్వే శాఖల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, నియోజకవర్గ కో–కన్వీనర్ బీవీ ముత్యాలరావు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు తదితరులు పురంధేశ్వరిని కలిసిన వారిలో ఉన్నారు.

రాజేశ్వరీ రామకృష్ణన్‌కు నివాళి



రాజేశ్వరీ రామకృష్ణన్ చిత్ర పటం వద్ద నివాళులు ఏడీఎల్ ప్రసాద్

చాగల్లు: రాజేశ్వరీ రామకృష్ణన్ స్థానికంగా జైపూర్ షుగర్ ఫ్యాక్టరీని స్థాపించడంతో ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక గ్రామాలు అభివృద్ధి చెందాయని జైపూర్ షుగర్స్ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఏడీఎల్ ప్రసాద్ అన్నారు. చాగల్లులోని షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో బుధవారం రాజేశ్వరీ రామకృష్ణన్ సంస్మరణ సభ నిర్వహించి, ఆమెకు ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ఆమె కార్మికులను, ఉద్యోగులను కన్నబిడ్డలుగా చూసుకున్నారన్నారు. విద్య, ఆరోగ్య సంస్థలు ఏర్పాటు చేసి మానవత్వం చాటుకున్న మహనీయురాలని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంద్రోతు సురేంద్రకుమార్, జుట్టా ఏడుకొండలు, గెడా శ్యాంసుందరం, కొవ్వూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పరిమి హరిచరణ్, ఫ్యాక్టరీ ఉద్యోగులు, రైతు సంఘ నాయకులు తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్, సత్యానందం, ఎస్వీఆర్కే కళాశాల ప్రిన్సిపాల్ కేవీ పావని తదితరులు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరులో..

కొవ్వూరు: ఇటీవల మృతి చెందిన జైపూర్ షుగర్స్ అధినేత రాజేశ్వరీ రామకృష్ణ సంతాప సభ గురువారం సాయంత్రం నాలుగు గంటలకు కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్లు రైతు సంఘం నాయకుడు పేరిచెర్ల బోసురాజు తెలిపారు.పరిసర ప్రాంత చెరకు రైతులు, ఆమెతో అనుబంధం ఉన్న రైతులు, నాయకులు ఈ సంతాప సభకు హాజరు కావాలని కోరారు.